# ప్రజాశక్తి

బుధవారం 7 జూన్ 2023 8 పేజీలు




గుంటూరు



పల్నాడు



## ఊరు కన్నీరు..

### ట్రాక్టర్ ప్రమాదంలో మృతిచెందిన మహిళల అంత్యక్రియలు పూర్తి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత దంపతులు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ట్రాక్టర్ బోల్తాపడి మండంలోని కొండేపాడుకు చెందిన ఏడుగురు మహిళలు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాలకు గుంటూరు జిజిహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం సోమవారం రాత్రే కుటుంబీకులకు అప్పగించారు. మంగళవారం మధ్యాహ్నం అంత్యక్రియలు పూర్తియ్యాయి. మృతులంతా గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందినవారే. ఈ కాలనీలో ఐదు వీదులుండగా మృతి చెందిన వారిలో మొదటి వీధికి చెందిన ఒకరు, రెండో వీధికి చెందిన ఇద్దరు. మూడో వీధికి చెందిన ఇద్దరు, నాలుగో వీధికి చెందిన ఒకరు, ఐదో వీధికి చెందిన ఒకరు చొప్పున ఉన్నారు. మృతదేహాలను ఇళ్లకు తెచ్చిన దగ్గర్నుంచి అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ అన్ని వీధుల్లోనూ రోధనలు మిన్నంటాయి. మృతుల కుటుబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చి మృతుల కుటుంబాలను చూసి వారూ కన్నీటి పర్యంతమయ్యారు. మృతదేహాలను ఎమ్మెల్యే ఎం.సుచరిత, ఆమె భర్త దయాసాగర్ సందర్శించి నివాళులర్పించారు. పలు పార్టీలు, సంఘాల నాయకులు నివాళులర్పించారు.



కొవ్వొత్తులతో నివాళు లర్పిస్తున్న వివిధ సంఘాల నాయకులు

## రైలు దుర్ఘటనలో మృతులకు నివాళి

### ప్రమాదానికి బాధ్యత వహిస్తూ రైల్వే మంత్రి మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఒరిస్సా రైలు ప్రమాదంలో మృతుల కుటుంబాలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి కోరారు. మృతులకు వడ్డేశ్వరంలోని జాతీయ రహదారి వద్ద సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైలు దుర్ఘటనకు బాధ్యత వహిస్తూ రైల్వే శాఖ మంత్రి రాజీనామా చేయాలన్నారు. అంతేకాకుండా మృతుల కుటుంబాలకు రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైల్వే శాఖను కూడా ప్రైవేట్ పరం చేసే చర్యలు, ఖాళీలను భర్తీ చేయకపోవడం దుర్ఘటనకు కారణమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అన్నారు. సిగ్నల్ వ్యవస్థను కూడా ప్రైవేట్ పరం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, నాయకులు ఎం.సూర్యనారాయణ, వై.కేశవరావు, జె.శివశంకరరావు, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి, డి.వెంకటరెడ్డి, కె.శివన్నారాయణ, ఎ.రంగారావు, కె.ఈశ్వర్‌రెడ్డి, పి.కృష్ణ, అప్పలరాజు, కె.స్వాతి పాల్గొన్నారు.

## భవిష్యత్ బాలలదే

- నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టండి
- విద్యార్థులకు ముగిసిన పల్నాడు విజ్ఞాన కేంద్రం వేసవి శిక్షణా శిబిరం

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు విజ్ఞాన కేంద్రం కోశాధికారి అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అన్నారు. స్థానిక గుంటూరు రోడ్డులోని సిల్మన్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సభకు విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు ఎ.బాగేశ్వరిదేవి అధ్యక్షత వహించారు. లక్ష్మీశ్వరరెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి చేరి నవ సమాజ అభివృద్ధికి బాటలు వేయాల్సింది విద్యార్థులేనన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నీతి నిజాయితీ ఎంతో ముఖ్యమని చెప్పారు. పల్నాడు విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ పూర్వకాలంలో తాటాకులు మీద ▶ 2లో




ముగింపు సభలో మాట్లాడుతున్న గుంటూరు విజయ్‌కుమార్



## గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-1 సర్వీసులకు సంబంధించి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఏపీపీఎస్సీ సభ్యులు జి.వి.సుధాకర్‌రెడ్డితో కలసి మంగళవారం పరిశీలించారు. పరీక్ష నిర్వహణ తీరుపై చీఫ్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు 692 మంది అభ్యర్థులు హాజరు కావలసి ఉండగా 533 మంది హాజరయ్యారని, 159 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఈ కేంద్రంలో గ్రూప్-1 పరీక్షలు జూన్ 10 వ తేదీ వరకు జరుగుతున్నందున పరీక్ష రాస్తున్న అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా నిర్వహించాలని చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.రాధికకు సూచించారు. ఏపీపీఎస్సీ నుండి పరీక్ష నిర్వహకులు అసిస్టెంట్ సెక్రటరీ వెంకట లక్ష్మి, సెక్షన్ అధికారులు రమణ, గిరిజ, పరీక్షల సమన్వయ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ మహబూబ్‌బాషా, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ సాంబశివరావు హాజరయ్యారు.

## ఈ-ఆటోలను రేపు ప్రారంభించనున్న సిఎం

ప్రజాశక్తి-గుంటూరు

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ ఈ-ఆటోలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించనున్నారని రాష్ట్ర పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి వై.శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా రాష్ట్రంలో ఇంటింటి చెత్తను తడిపొడిగా వేరుగా సేకరించటానికి 516 ఈ-ఆటోలను ప్రభుత్వం అందించిందని, ఈ-ఆటోలను సిఎం ప్రారంభించిన తర్వాత శుక్రవారం నుండి ఆయా నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీల వార్డ్ సచివాలయాల వారిగా ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. తద్వారా మెరుగైన ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేయడానికి అవకాశం కల్గుతుందన్నారు. ఇప్పటికే ప్రజారోగ్య కార్మికులకు దశల వారీగా ఆటోల డ్రైవింగ్ శిక్షణ ఇచ్చామని, ఈ-ఆటోల ప్రారంభోత్సవ కార్యక్రమ నిర్వహణకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి, సిడిఎంఎ, జిల్లా కలెక్టర్, విజయవాడ, మంగళగిరి-తాడేపల్లి కమిషనర్లకు విధులు కేటాయించినట్లు తెలిపారు.



# సిఎం పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన



ప్రజాశక్తి - నరసరావుపేట/క్రోసూరు

నెల 12న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో పర్యటించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మంగళవారం పరిశీలించారు. సిఎం సందర్శించే మోడల్ స్కూల్‌లో తరగతి గదులను, హెలీప్యాడ్ స్థలాన్ని,



బహిరంగ సభా ప్రాంగణ స్థలాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. అనంతరం ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, విద్య, సమగ్ర శిక్ష, సాంఘిక సంక్షేమం తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. జగనన్న విద్యాకానుక కిట్లను ముఖ్య మంత్రి విడుదల చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రూ.217 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు సిఎం చేస్తారని చెప్పారు. వేసవి దృష్ట్యా కార్యక్రమానికి వచ్చే ప్రజలకు తాగునీరు, మజ్జిగ, నీడ తదితర ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. వాహనాల పార్కింగ్, భోజన వసతి ఏర్పాట్లతో పాటు భద్రతా ఏర్పాట్లలో తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, ఆర్డీవో రాజకుమారి పాల్గొన్నారు.



## ఈదురు గాలులకు విరిగిపడ్డ చెట్లు...

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటతో పాటు పరిసర ప్రాంతాలలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన ఈదురు గాలులకు పలు ప్రాంతాలలో చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే నరసరావుపేట నకరికల్లు మార్గంలో రావిపాడు వద్ద 2 ప్రాంతాలలో పెద్ద చెట్లు విరిగి పడడంతో పిడుగురాళ్ల, మాచర్ల వెళ్లే హైదరాబాద్ వెళ్లే బస్సులు ఇతర వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.



20వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యులు బి.పద్మావతి

## అంగన్వాడి కేంద్రాల్లో బాలల హక్కుల కమిషన్ తనిఖీలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పట్టణంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు బి.పద్మావతి మంగళవారం తనిఖీ చేశారు. సత్తెనపల్లి పట్టణంలోని 2, 20, 22 వార్డుల్లోని కేంద్రాలను సందర్శించి పౌష్టికాహారం పంపిణీ, మెనూ అమలును పరిశీలించి తల్లులతో మాట్లాడారు. వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో గర్భిణులు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. హాజరు రిజిస్టర్, ప్రీ స్కూల్ బోధనా పద్ధతులను పరిశీలించారు. కార్యక్రమంలో సిడిపిఒ టి.శ్రీలత, అదనపు సిడిపిఒ టి.సంతోషకుమారి, సూపర్‌వైజర్ పి.ప్రమీల, జి.జయలక్ష్మి పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణకు పొలాలకు మార్కెట్ ధర

ప్రజాశక్తి -మేడికొండూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్ హెచ్ -167 జాతీయ రహదారి విస్తరణ చేపట్టనుంది. మండలంలోని మంగళగిరి పాడు గ్రామము, కొర్రపాడు గ్రామాల పరిధిలోని రైతులతో అవగాహన కార్యక్రమం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ కలెక్టర్ శివ నారాయణ శర్మ పాల్గొన్నారు. జాతీయ రహదారి విస్తరణకు అవసరమైనటువంటి పొలాలు సేకరణ మార్కెట్ విలువకు లోబడి రైతులకు పరిహారం అందించడం జరుగుతుందని అన్నారు. ఎన్ హెచ్ 167 జాతీయ రహదారి ఏర్పాటు వలన కలిగే పలు రకాల ప్రయోజనాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో తాసిల్దార్ కే కరుణ కుమార్ కొర్రపాడు, తురకపాలెం గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.





## జులై నాటికి ఎంపీ ల్యాడ్స్ పనులు పూర్తి చేయండి

### ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశం

ప్రజాశక్తి - నరసరావుపేట

2019-23 కాలానికి ఎంపీల్యాడ్స్ నిధులతో మంజూరైన పనులను జులై నాటికి పూర్తి చేయాలని అధికారులను ఎంపీ లావు శ్రీకష్ణ దేవరాయలు, జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని ఎస్.ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు ఎంపీల్యాడ్స్ నిధుల వినియోగంపై నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయలు మరియు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు.సమావేశంలో ఎంపీ, జిల్లా కలెక్టర్లు మాట్లాడుతూ ఐదేళ్ల కాలానికి రూ.12.44 కోట్ల నిధులతో 141 పనులు మంజూరు చేశామన్నారు. వాటిలో రూ.5.40 కోట్ల నిధులతో చేపట్టిన 98 పనులు పూర్తి కావడం లేదా పూర్తి దశకు చేరుకోవడం జరిగిందన్నారు. మిగిలిన పనులను జులై నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ , డీఆర్వో వినాయకం, సీపీవో ముక్తేశ్వర రావు, ఈఈ పీఆర్ సుబ్బారాయుడు, ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ సురేశ్, ఏపీసీపీడీసీఎల్ డీఈ , ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీధర్, దాచేపల్లి, గురజాల మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## ముస్లిముల సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి

ప్రజాశక్తి పొన్నూరు రూరల్



ముస్లింల హితమే అభిమతంగా ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ నాజర్ తెలిపారు. ముఖ్యమంత్రి పేష్ ఇమామ్, మౌజన్లకు గౌరవ వేతనం చెల్లిస్తూన్నారని, ఇది వారి కుటుంబ జీవనానికి ఉపయోగపడుతుందని తెలిపారు. వైసిపి ఆధ్వర్యంలో హర్ దిల్ మే వైయస్సార్.. హమ్ సబ్ జగన్ కే సాత్" ఈనెల 5వ తేదీ నుంచి ప్రారంభించిన ముస్లింలు, పేష్ ఇమామ్, మౌజనుల సంక్షేమం, అభివద్ధి, జీవన స్థితిగతులపై ఏర్పాటుచేసిన అధ్యయనంపై పొన్నూరు పట్టణంలో స్థానిక ముస్లిం మైనార్టీ నాయకులతో కలిసి ఆయన మసీదులను సందర్శించి నిర్వాహకులతో సమీక్షించారు. స్థానిక వైష్ణవి నగర్ లోని ఆయేషా నిస్వాన్, ఆలూరు లోని కుబా మసీదుల్లోని పేస్ ఇమామ్ మోజోన్లకు గౌరవ వేతనాలు మంజూరు కాలేదని ప్రభుత్వం స్పందించి వెంటనే వారికి గౌరవ వేతనాలు విడుదల చేయాలని కోరారు. తాత్కాలికంగా నిర్మించిన మసీదుల స్థానంలో శాశ్వత పక్క మసీదుల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జనాబ్ అబ్దుల్లా , ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ పీరు, షేక్ ఖయ్యూం, షేక్ నజీర్ ,హబీబుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



## భవిష్యత్ బాలలదే

(మొదటి పేజీ తరువాయి)

అక్షరాలు నేర్చుకునేవారని, అనంతరరం మట్టి పలకలు కాలక్రమేణా డిజిటల్ కాలంలోకి వచ్చామని చెప్పారు. పుస్తక పఠనం ద్వారా అమితమైన జ్ఞానం సంపాదించవచ్చని, పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు, కె.రామారావు, కార్యనిర్వాహక కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ రానున్న రోజుల్లో పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. నేర్చుకున్న అంశాలను ఆచరణలో పెట్టాలన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లీష్, గణిత శాస్త్ర, సైన్స్ విభాగాల్లో తరగతులు తమకెంతో ఉపయోగపడ్డాయని, తామెంతో నేర్చుకున్నామని చెప్పారు. చేతివ్రాతలో మెలకువలు బాగున్నాయన్నారు. అనంతరం ఆదివారం నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పలు అంశాల్లో శిక్షణిచ్చిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సిలార్ మసూద్, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి, ముస్లిం మైనారిటీ ఐక్యవేదిక నాయకులు జిలాని మాలిక్, జన విజ్ఞాన వేదిక నాయకులు సుభాష్ చంద్రబోస్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. జాతీయ గీతాలపానతో కార్యక్రమం ముగిసింది.

## విస్తృత సమావేశానికి రండి : కన్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలో ఈనెల 9న జరిగే టిడిని నియోజకవర్గ విస్తృత సమావేశానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కన్నా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పట్టణంలోని తన కార్యాలయంలో టిడిపి మండలాల అధ్యక్షులు, అనుబంధం విభాగాలు, క్లస్టర్ ఇన్చార్జిలతో కన్నా లక్ష్మీనారాయణ మంగళవారం సమావేశమయ్యారు. 9వ తేదీన సత్తెనపల్లి వెంకటేశ్వర గ్రాండ్ కళ్యాణ మండపంలో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, నాయకులు వై.రామస్వామి బాజీచౌదరి, నాగోతు శౌరయ్య పాల్గొన్నారు.



## ప్రతి ఫ్రైడేను డ్రైడేగా పాటించాలి

ప్రజాశక్తి - తాడికొండ



డెంగ్యూని నిర్మూలించాలంటూ పొన్నికల్లు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ఆధ్వర్యంలో పిహెచ్‌సి నుండి ఎస్ బి ఐ బ్యాంకు వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ డాక్టరు కె తిరుమలా దేవి మాట్లాడుతూ డెంగీ లక్షణాలు తీవ్రమైన జ్వరం తలనొప్పి కండరాలు, కీళ్ళు నొప్పులు ఉంటాయన్నారు. రక్తంలో ప్లేట్ లెట్ తగ్గడం వలన వీరికి ఆసుపత్రిలో చికత్స అందించాలన్నారు. ఈ వ్యాధి వచ్చినవారికి ప్రాథమిక దశలో 80శాతం సపోర్టివ్ ట్రీట్మెంట్ వలన తగ్గుతుందని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు.

## తాడేపల్లి పట్టణవాసులకు పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-తాడేపల్లి



తాడేపల్లి పట్టణంలోని సుమారు వెయ్యి మంది లబ్దిదారులకు రాజధాని పరిధిలోని కృష్ణాయపాలెం లేఅవుట్‌లో మంగళవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ లబ్దిదారులు కోరితే ప్రభుత్వమే ఇళ్ల నిర్మించి ఇస్తుందని చెప్పారు. జులై 8 నుంచి గృహ నిర్మాణ పనులు చేపడతామని చెప్పారు. సంక్రాంతి పండుగ రోజున గృహ ప్రవేశాలు చేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, జిల్లా కార్యదర్శి ఇ.డేవిడ్‌రాజు, కళ్లం రాజశేఖరరెడ్డి, మేకా వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## సిపిఐ అగ్రనేత చండ్రకు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి

సిపిఐ అగ్ర నేత చండ్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా మంగళవారం దేవస్థానం వద్ద గల రాజేశ్వరరావు విగ్రహానికి సిపిఐ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య, కంచర్ల కాశయ్య, జాలాది జాన్ బాబు, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు మూఢనమ్మకాలను వ్యతిరేకించాలి

ప్రజాశక్తి-తాడేపల్లి



సమాజంలో జరుగుతున్న అనేక మూఢనమ్మకాలను వ్యతిరేకించాలని, నిజానిజాలు తెలుసుకుని ప్రజలను చైతన్యం చేయాలని మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, సుందరయ్య నగర్ ఎంకెఆర్ ట్రస్టు నిర్వాహకులు కొట్టె కరుణాకరరావు, ఇంగ్లీషు లిటరేచర్ ఎం.రాజకమల్ పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి తాడేపల్లి సుందరయ్య నగర్‌లోని లీలా సుందరయ్య కళా వేదికపై గత 20 రోజుల నుంచి మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఇంగ్లీషు కోచింగ్ శిక్షణా తరగతులు ముగింపు, బహుమతి ప్రదానోత్సవ సభ, సర్టిఫికెట్ల అందజేత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు కొట్టె కరుణాకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఇంగ్లీషుతో పాటు మాతృభాష తెలుగును మరువద్దని అన్నారు. అమ్మభాషలోని గొప్పతనం గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. ఇటీవల ఒడిస్సాలో జరిగిన రైలు ప్రమాదంపై అనేక అబద్ధపు ప్రచారాలు చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. రైలు ప్రమాదానికి కూడా మతం రంగు పులమడాన్ని ప్రతిఘటించారు. పిల్లలు ఒక లక్ష్యాన్ని ఎంచుకుని బాగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించడంతో పాటు సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఎంబివికె లాంటి విజ్ఞాన కేంద్రాల ద్వారా భవిష్యత్తులో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎంకెఆర్ ట్రస్టు, సుందరయ్య సాంస్కృతిక సేవా సమితి, మంగళగిరి తాడేపల్లి బాలోత్సవం విజ్ఞానంతో పాటు సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు ఎస్‌కె బాష, కె.ప్రభాకర్, బి.రామారావు, బేబి, సిహెచ్.భుజంగరావు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలం, వేములూరుపాడు గ్రామానికి చెందిన పోతురాజు వెంకట శివరావు (29) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం మృతిచెందిన పోతురాజు గత కొంత కాలంగా మానసిక స్థితి సరిగాలేకపోవడంతో మద్యం తాగడానికి అలవాటు పడ్డాడన్నారు. ఈ క్రమంలో సోమవారం ఇంటిలో ఎవరూ లే ని సమయంలో మద్యం మత్తులో పురుగు మందు తాగాడన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు జిజిహెచ్‌కి తరలించారని, పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడని తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి బుధవారం మృతదేహాన్ని అప్పగిస్తారని తెలిపారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ప్రధాన సమస్యలపై ప్రభుత్వం సానుకూలత

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగ సంఘాలతో మంత్రుల కమిటీ నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ప్రధానమైన ఆర్థిక అంశాలు, ప్రభుత్వ హామీలపై సానుకూల నిర్ణయాలు తీసుకున్నట్లు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం గుంటూరులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2018 జులై 1, 2019 జనవరి 1 రెండు డిఎ అరియర్లు, సరెండర్ లీవుల డబ్బులు ఈ ఏడాది సెప్టెంబర్‌లోగా చెల్లిస్తామని, అలాగే 2019 జులై 1, 2021 జులై 1 డిఎలు, పిఆర్‌సి అరియర్లు కలిపి రూ.7370 కోట్లను గతంలో రిటైర్మెంట్ ఇస్తామన్న ప్రభుత్వం తాజా చర్చల్లో 16 వాయిల్లో నాలుగేళ్లలో చెల్లించటానికి అంగీకరించారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు 7వేల మంది క్రమబద్ధీకరణ అవుతున్నారని, 12వ పిఆర్‌సి కమిషన్ నియమించనున్నారని అన్నారు. సిపిఎస్‌పై అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా స్పష్టత ఇస్తూ ఈనెల 7న జరిగే క్యాబినెట్‌లో చర్చించి, మెరుగైన విధానం ప్రకటిస్తామని తెలిపారన్నారు. ఇంకా అనేక శాఖల ఉద్యోగుల సమస్యలపై అనేక హామీలు ఇచ్చారన్నారు. ఏపిజెఏసి అమరావతి చేపట్టిన సుదీర్ఘ ఉద్యమం కారణంగానే సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల అనేక ఆర్థిక/అర్థికేతర సమస్యలకు పరిష్కారం లభించిందని బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఉద్యమం జరుగుతున్న క్రమంలో ప్రభుత్వం వినియోగించుకున్న వేల కోట్ల రూపాయల బకాయిలను చెల్లించడంతో పాటు, వేల సంఖ్యలో కారుణ్య నియామకాలు, కొత్త జిల్లాల హెడ్ క్వార్టర్స్‌లో 16శాతం హెచ్‌ఆర్‌ఎ, పోలీసులకు టి ఏలు, సరెండర్ లీవుల సమస్య తీరనుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కనపర్తి సంగీతరావు, ప్రధాన కార్యదర్శి పిఏ కిరణ్‌కుమార్, నాయకులు మల్లేశ్వరరావు, ఫణిపేర్రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు



## సిబిఐ మాజీ డైరెక్టర్ ప్రకటనకు కేంద్రం సమాధానం చెప్పాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**



**ప్రజాశక్తి-గుంటూరు :** రైల్వే ప్రమాదంపై సిబిఐ మాజీ డైరెక్టర్ ఇచ్చిన ప్రకటనకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేట, సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన వర్క్‌షాప్‌కు హాజరైన ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి రైలు ప్రమాదంపై స్పందించకుండా సమస్యను పక్కదారి పట్టించటానికి దొంగదారులు వెతుక్కుంటుందని విమర్శించారు. కేంద్ర హోం మంత్రి, రాష్ట్ర హోం మంత్రి రైల్వే శాఖ మంత్రి కుల, మత విద్వేషాలు సృష్టించాలని చూడటం దారుణమన్నారు. హోం మంత్రి ఈ ఘనటపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్ట్ పర్యటనకు ఎందుకు వెళుతున్నారో ఆయనకు తెలుసా అని అడిగారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో లాలూచి పడి రాష్ట్ర ప్రయోజనాలను మోడీ కాళ్లదగ్గర పెట్టారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్ట్‌పై సిఎం తక్షణమే స్పష్టమైన వైఖరి ప్రజలకు చెప్పాలని లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 26న పోలవరం ప్రాజెక్ట్ వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమ ంలో సిపిఐ జిల్లా, నగర కార్యదర్శులు జంగాల అజయ్‌కుమార్, కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# గుర్తింపు కోసం కౌలురైతుల వినతులు




సత్తెనపల్లి మండలం కందులవారిపాలెంలో విఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న కౌలురైతులు, నాయకులు

**ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్**

రైతు భరోసా, పంటల బీమా, పంట నష్టపరిహారం కౌలు రైతులకే ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు దుగ్గి మేరమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం కందులవారిపాలెంలో విఆర్ఒకు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మేరమ్మ మాట్లాడుతూ కౌలు రైతుల గుర్తింపు కార్డుల కోసం భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధనను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.లక్ష్మీనారాయణ, పి.మహేష్, రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, కౌలు రైతులు వెంకయ్య, నరసింహారావు, రామారావు, నాగబిక్షం, సత్యవతి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని స్థానిక 12వ వార్డులోని సచివాలయంలో విఆర్ఒకు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మంగళవారం వినతిపత్రం ఇచ్చారు. సంఘం డివిజన్ అధ్యక్షులు సాతులూరి లుథర్ మాట్లాడుతూ కౌలురైతులకు గుర్తింపు కార్డుల జారీలో భూయజమాని సంతకం నిబంధనను తొలగించాలని, ఈ క్రాప్‌లో కౌల్దార్లనే నమోదు చేయడంతోపాటు పంట రుణాలు, ఇతర ప్రభుత్వ ప్రోత్సహకాలు, రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన ప్రతి కౌలురైతుకు రూ.6 వేలు చొప్పున పింఛను ఇవ్వాలని కోరారు. ఈ అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టే జీపు జాతాలు, 10, 11, 12 తేదీల్లో పాదయాత్ర, మంగళగిరి సిసిఎల్ఎ వద్ద ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు మండల కార్య దర్శి పి.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు



రొంపిచర్ల మండలం సంతగుడిపాడు సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ప్రజాశక్తి - నరసరావుపేట**

కౌలు రైతుల చట్టాన్ని సవరించాలని, భూ యజమాని సంతకం నిబంధన వల్ల గుర్తింపు కార్డులు తీసుకోవడంలో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కౌలు రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు రొంపిచర్ల మండలం సంతగుడిపాడు సచివాలయంలో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. గుర్తింపుకార్డుల్లేక తమకు బ్యాంకు రుణాలు దక్కడం లేదని, ఈ-క్రాప్‌లోనూ తమను నమోదు చేయడం లేదని, బీమా, పరిహారాలు అందడం లేదని చెప్పారు. వాస్తవ సాగుదార్లమైన తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. చట్టంలో నిబంధనలు మార్చి తమకు న్యాయం చేయాలని, రైతు భరోసాను కౌలురైతులకే దక్కేలా చూడాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో బి.నాగేశ్వరరావు, యాకోబు, బి.కోటేశ్వరరావు, ప్రసాదు, కౌలురైతులు ఉన్నారు.



ప్రచారంలో ఉపాధ్యాయులు

## పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

**ప్రజాశక్తి - చిలకలూరిపేట**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని, అంగ్లంలోనూ బోధిస్తున్నామని ఉపాధ్యాయలు ఇంటింటి ప్రచారం చేపట్టారు. పట్టణంలోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం పాఠశాల పరిసర ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఉచితంగా పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, బూట్లు, బెల్టు, బలవర్ధకమైన మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని, వీటితోపాటు అమ్మఒడి సైతం వర్తిస్తుందని చెప్పారు. పిల్లలకు వైద్య పరీక్షలు చేసి రక్త హీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు అందిస్తారన్నారు. 'నాడు-నేడు' కింద పాఠశాలలకు మౌలిక వసతులూ సమకూర్చారని, ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన బోధనా పద్ధతుల్లో విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఇదిలా ఉండగా ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా పేరెంట్స్ కమిటీ సభ్యులూ సహకరించాలని ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు కోరారు.



విత్తనాలను అందిస్తున్న ఎంపిపి హనుమంతరావు యాదవ్, ఏవో

## పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ

**ప్రజాశక్తి - అమరావతి :** మండలానికి 130 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు (జీలుగ, జనుము, పిల్లి పెసర) వచ్చాయని, కావాల్సిన రైతులు సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి షేక్ అహ్మద్ చెప్పారు. ఈ మేరకు జూపూడి రైతు భరోసా కేంద్రంలో విత్తనాలను ఎంపిపిల సంఘం రాష్ట్ర కన్వీనర్ అయిన మండల ఎంపిపి మేకల హనుమంతరావు యాదవ్ మంగళవారం అందించారు. సబ్సిడీపై అందించే ఈ విత్తనాలను సాగు చేసి భూసారాన్ని పెంచుకోవాలని, రసాయన ఎరువుల వినియోగాన్ని, ఖర్చును తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. విఆర్ఒ ముకుందరావు, వైసిపి నాయకులు పి.శివరామిరెడ్డి, జె.నాగరాజు, డేవిడ్, ఎం.శివశంకర్, షేక్ మస్తాన్ షరీఫ్, టి.నీలయ్య, వెంకీ, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్ హత్యకు ఖండన


**ప్రజాశక్తి - అమరావతి**

ప్రకాశం జిల్లా టంగుటూరులోని అంగన్వాడీ కేంద్రం టీచర్‌ను దారుణంగా హత్య చేసిన వైసిపి నాయకుణ్ణి తక్షణమే అరెస్టు చేయాలని, కఠినంగా శిక్షించాలని సిఐటియు డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఐటియు మండల కార్యదర్శి బి.సూరిబాబు మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. భూవివాదాలను ఆసరాగా చేసుకుని అంగన్వాడీ టీచర్ సవల అనుమాయమ్మ హతమార్చారని, ఆమె స్థానిక బోరు నుండి నీరు తెచ్చుకుంటుండగా వైసిపి నాయకుడు కొండలరావు ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేశారని పేర్కొన్నారు. అధికార బలంతో ఇంతటి ఘాతుకానికి పాల్పడిన అతణ్ణి వెంటనే అరెస్టు చేయాలన్నారు. హత్యను ఖండించిన వారిలో షేక్ రఫీ, మోహిద్దీన్‌వలి, ఎం.నవీన్, ఎం.సుబ్రహ్మణ్యం ఉన్నారు.

# పనిలో నుండి తీసేయొద్దు..

### కొనసాగిస్తూ పెండింగ్ జీతాలివ్వాలని పారిశుధ్య కార్మికుల వినతి

**ప్రజాశక్తి-పిడుగురాళ్ల**



ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

మండలంలోని జానపాడులో స్వచ్ఛభారత్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ స్థానిక ఎంపిడిఒ కాశయ్యకు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామాలను శుభ్రంగా ఉంచే కార్మికులకు 10 నెలలుగా వేతనాలు ఇవ్వకపోతే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికే వేతనాలు పెండింగ్‌లో ఉండగా మరోవైపు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్‌ను ఆపేశారంటూ విధుల నుండి తొలగించడం అన్యాయమన్నారు. పనులకు రాకుండా ఎనిమిది మందిని ఆపేశారని, వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవడంతోపాటు పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని కోరారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్మికులు డి.మేరిబాబు, టి.రామయ్య, జి.గురునాథం, బి.ఏసుదాసు, దావీదు, జి.నాగయ్య, ఆర్.విజయ్, వెంకాయమ్మ ఉన్నారు.

## 20వ రోజుకు పిఎస్‌వికె మజ్జిగ చలివేంద్రం

**ప్రజాశక్తి-సత్తెనపల్లి**




పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం (పిఎస్‌వికె) ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మజ్జిగ కేంద్రం మంగళవారం 20వ రోజు కొనసాగింది. పిఎస్‌వికె కన్వీనర్ పొట్టి నాగ మల్లికార్జునరావు జ్ఞాపకార్థం భార్య రమాదేవి మంగళవారం మజ్జిగను సమకూర్చి పంపిణీని ప్రారంభించారు. నిర్వాహకులు పి.సూర్యప్రకాశరావు, ఎ.వెంకట్‌నారాయణ, డి.వెంకటేశ్వర్లు, కె.జగన్‌మోహన్‌రావు, ఎం.హరిపోతురాజు, జె.మరియమ్మ పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి

## పోలీస్ మృతుల కుటుంబాలకు అండగా శాఖ

### కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేసిన ఎస్పీ

**ప్రజాశక్తి - నరసరావుపేట**

పోలీస్ శాఖలో పని చేస్తూ అనారోగ్యం వల్ల, ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లపుడూ అండగా ఉంటుందని పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి అన్నారు. నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఈ ఏడాది ఏప్రిల్‌లో విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్తున్న సందర్భంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన తాళ్లూరి సూర్యనారాయణ కుటుంబానికి రూ.లక్ష అదనపు కార్పస్ ఫండ్, భార్యకు లతకు రూ.50 వేల విడో ఫండ్, రూ.25 వేల ఇన్సిడెంటల్ ఛార్జెస్ చెక్కులను మంగళవారం అందించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పీ రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె.చంద్రశేఖర్, జిల్లా ఎఎఒ కెవిడి రామారావు, ఆర్ఐ వెల్ఫేర్ వెంకట రమణ, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

## మండలానికి నూతన సర్వేయర్

**ప్రజాశక్తి-ఈపూరు :** మండలంలో డిప్యూటీ సర్వేయర్‌గా పని చేస్తున్న పి.చండీరాణి ప్రమోషన్‌పై మండల సర్వేయర్‌గా నూజెండ్ల మండలం వెళ్లారు. శావల్యాపురం మండలంలో డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేస్తున్న తుంగా శ్రీనివాసరావు ప్రమోషన్‌పై ఈపూరు మండల సర్వేయర్‌గా బాధ్యతలు చేపట్టారు.

**యజమాని సంతకం లేకుండా**

# కౌలు రైతులకు గుర్తింపు కార్డులివ్వాలి

**ఆర్‌బికెల్లో వినతి పత్రాలు - కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం - రాష్ట్ర జాతా, 12న సిసిఎల్ఎ కార్యాలయం వద్ద ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు**

ప్రజాశక్తి - పెదనందిపాడు

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళగవారం పెదనందిపాడు ఆర్‌బికెలో కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొత్త శివ నాగేశ్వరరావు మాట్లాడుతూ వాస్తవ సాగుదారులు కౌలు రైతులేనని, వ్యవసాయంలో 70 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని తెలిపారు. కౌలు రైతులకు సాగు గుర్తింపు కార్డులు రావడంలేదని, ప్రభుత్వం భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతు కార్డులు ఇస్తామన్న నిబంధన పెట్టడంతో, పెద్ద ఎత్తున కౌలు రైతులు నష్టపోతున్నారని తెలిపారు. ఈ కారణంతో కౌలు రైతులకు ఇన్పుట్ సబ్సిడీలు, సాగు రుణాలు, రైతు భరోసా, పంట నష్టపరిహారం వంటివి ఏవి కూడా వర్తించక అప్పుల పాలు అవుతున్నారని , అందువలనే ఆత్మహత్యల్లో కౌలు రైతులే ఎక్కువగా ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి కౌలు రైతుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ష్యూరిటీ లేకుండా పంట రుణాలు ఇవ్వాలని, పంటల బీమా, నష్టపరిహారాలు, పంటను అమ్ముకునే అవకాశం కౌలు రైతులకు కల్పించాలని డిమాండ్ చేశారు. కేరళ తరహా రుణ విముక్తి చట్టాన్ని చేసి కౌలు, సన్న, చిన్నకారు రైతుల రుణాలు రద్దు చేయాలని కోరారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్ర జీపు జాతా పెదనందిపాడు మండలంలోకి ఎనిమిదో తారీకు వస్తుందని, ఈ జాతాలో కౌలు రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు చుక్కా యానాదులు, రైతు సంఘం మండల కార్యదర్శి కొత్త వెంకట శివరావు, కౌలు రైతులు లావు సాంబశివరావు, పానుబోతుల ప్రసాదు, గోనుగుంట్ల నాగబాబు, దివ్వి వీరయ్య, కే సింగారావు, స్వర్ణ పెద్దబ్బాయి పాల్గొన్నారు.



మేడికొండూరులో ప్రచారం నిర్వహిస్తున్న బైరగాని శ్రీనివాసరావు,రామకృష్ణ



పెదనందిపాడు రైతు భరోసా కేంద్రంలో వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ప్రజాశక్తి- మేడికొండూరు

మండలంలోని ఎలవర్తిపాడు గ్రామంలో కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీపై కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నాయకులు బొట్ట రామకృష్ణ మాట్లాడుతూ కౌలుదారులకు ఇచ్చే గుర్తింపు కార్డులలో భూయజమాని సంతకంను తొలగించి ,సాగు చేసే రైతులకు స్కేల్ ఆ ఫైనాన్స్ ప్రకారం రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వినతి పత్రం అందజేసేందుకు సంతకాలు సేకరించారు. కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కౌలు రైతుల సమస్యలపై జీవజాతాలు ప్రారంభించారని, ఈ జాతాలు నెల్లూరు నుండి బయలు దేరి 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు ఎలవర్తిపాడు రానున్నట్లు తెలిపారు. ఆ జాతాలో కౌలు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు నిర్వహిస్తున్నారని తెలిపారు. అనంతరం 12వతేదీన విజయవాడ నుండి నిర్వహించే పాదయాత్ర మంగళగిరి సీసీఎల్ఏ ఆఫీస్ ధర్నా చేపడుతుందని చెప్పారు. జాతాకి, ధర్నాలకు కౌలు రైతులు పెద్ద ఎత్తున హాజరుకావాలని బైరగాని శ్రీనివాసరావు పిలుపిచ్చారు. తురకపాలెంలో రామకృష్ణ ప్రచారం నిర్వహించారు.

## 10న కొల్లిపరకు రానున్న జీపుజాత

ప్రజాశక్తి - కొల్లిపర

కౌలు రైతు చట్టాన్ని సవరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాపితంగా ప్రచారం నిర్వహిస్తున్న జీపు జాతా ఈనెల 10న కొల్లిపర మండలంలో ప్రచారం నిర్వహిస్తుందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం అన్నవరం, గౌడపాలెం, అన్నవరపు లంక, శివలూరు గ్రామాల్లో పర్యటించి కౌలు రైతులతో మాట్లాడారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోవడంతో వారు నష్టపోతున్న విధానాన్ని వివరించారు. ఈ నేపథ్యంలో గుర్తింపు కార్డుల సాధనకు కౌలు రైతులు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కౌలు రైతుల డిమాండ్ల సాధనకు ఈనెల 12న మంగళగిరి సీసీఎల్‌ఏ కార్యాలయం వద్ద నిర్వహించే రాయబారం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జొన్న సాంబశివరావు, ఏమినేని గోవిందు, టి నరసింహారావు, యు శ్రీనివాసరావు, నరేంద్రబాబు, టీ దాసు, ఎం శ్యాం ప్రసాద్, డి భర్నబాస్ పాల్గొన్నారు.



కొల్లిపరలో రైతులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

## తవ్వారు... వదిలేశారు

- నిరుపయోగంగా దాసుల కాలనీ చెరువు
- ఆరు ఎకరాల పొలాన్ని బీడు చేశారు
- అసాంఘిక చర్యలకు అడ్డాగా మారిన వైనం
- పట్టించుకోవాలని వేడుకుంటున్న ప్రజలు



ప్రజాశక్తి - ఫిరంగిపురం



ఆరు తరాల నుండి మాలదాసులు ఎస్సీలు సాగు చేసుకుంటున్న భూమిని రెండు దశాబ్దాల క్రితం తాగునీటి కోసం ప్రభుత్వం తీసుకుని పనుల మొదలేసింది. చెరువులో చట్టు బండలు పటడంతో మంచి నీటికి పనికి రాదని వదిలేశారు. కాలనీ మధ్యలో పెరిగిన పిచ్చి కంపతో నిరుపయోగాంగా మారిన చెరువు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సాగుభూమిగా ఉండనిస్తే సేద్యం చేసుకునేవాళ్లమని ఎస్సీలు చెబుతున్నారు.



ఫిరంగిపురం మండలం బేతపూడి గ్రామంలో దాసుల కాలనీకి మధ్యలో సర్వే నంబర్ 208లో ఆరు ఎకరాల సాగుభూమి ఉంది. ఈ భూమిలో ఎస్సీలు పంటలు పండిచుకుని బ్రతుకుతున్నారు. ఈ క్రమంలో 2001, 2002లో అప్పటి జిల్లా కలెక్టర్ హీరాలాల్ సామారియా గ్రామానికి తాగునీరు అందించే నిమిత్తం ఆ పంట భూమిలో చెరుతు తవ్వించేందుకు చర్యలు చేపట్టారు. తవ్విన చెరువు తాగునీటికి వినియోగంలోని రాదని గమనించిన అధికారులు దానిని వదిలేశారు. తవ్విపోసిన చెరువులో వ్యవసాయం చేయడం సాధ్యం కాకపోవడంతో మాల దాసులు వదిలేశారు. తాము జీవనోపాధికి కోల్పోయామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటినుండి ఇప్పటివరకు ఏ అధికారులు పట్టించుకోలేదని, ప్రస్తుతం పాడుబడ్డ ఈ చెరువులో చిట్టడవిలా పిచ్చికంప పెరిగిందని, దాసుల కాలనీకి మధ్యలో చెరువు ఉండడం వలన ఆ పాడుబడ్డ చెరువులోని పాములు తేళ్లు విష పురుగులు ఇళ్లలోకి చేరి స్థానిక ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నామని, బహిర్భూమిగా ఉపయోగించడం వలన దుర్వాసనకు బేతపూడి గ్రామ ప్రజలు మరియు ప్రక్కనే ఉన్న గుండాలపాడు అగ్రహారం లోని ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నామని మీడియాకు తెలిపారు. కొందరు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించడంతో చెరువు చుట్టుపక్కల గృహస్తులు ఉండలేక పోతున్నామని తెలుపుతున్నారు. ఇటీవల ప్రధాన మంత్రి జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా సంబంధిత అధికారులు ఈ చెరువును మళ్లీ పరిశీలించారు. తాగునీరుకు పనికి రాదని నిర్ధారించారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి బేతపూడి గ్రామానికి తాగునీరు సౌకర్యం కల్పించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కాలువల్లో వ్యర్థాలు తొలగింపు

## డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

వర్షాకాలం సమీపిస్తున్న నేపధ్యంలో పట్టణంలో సైడు కాలువల పూడిక తీత పనులు ప్రారంభమయ్యాయి. వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న 32వ వార్డు యడ్ల లింగయ్య కాలనీ గేటు నుంచి గుంటూరు ట్రాక్ వరకూ గల కాలువలో పొక్లెయిన్ ద్వారా వ్యర్థాలను తొలగింపును మంగళవారం చేపట్టారు. వార్డులో పారిశుధ్య మెరుగుకు తగిన చర్యలు తీసుకుంటామని సంధ్యారాణి తెలిపారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సుధాకర్, నాయకులు మట్లపూడి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర జాతాను జయప్రదం చేయండి

**కరపత్రాన్ని ఆవిష్కరించిన మున్సిపల్ కార్మికుల**

ప్రజాశక్తి-తాడేపల్లి

ఈ నెల 8వ తేదీ మున్సిపల్ కార్మికుల రాష్ట్ర జాతా మంగళగిరి వస్తున్న సందర్భంగా పెనుమాకలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గుంటూరు జిల్లా అధ్యక్షులు రాచూరి వేణు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలకు చిత్తశుద్ధిలేదని విమర్శించారు. తమకు నెలనెలా జీతాలు వేయాలని డిమాండ్ చేశారు. రాజధానిలో కాంట్రాక్టర్ మారినప్పుడల్లా కార్మికులక కష్టాలు తప్పడంలేదన్నారు. జాతాను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



## పారిశుధ్య కార్మికులకు సబ్బులు, కొబ్బరినూనె ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణాన్ని శుభ్రం చేసి ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండటానికి కృషి చేస్తున్న పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లు మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌లో తాడేపల్లి జోన్‌లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత 13 నెలల నుంచి కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల ఆరోగ్యం పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధిలేదని విమర్శించారు. మంగళవారం పట్టణంలోని పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మురుగు కాలువల్లో చెత్తను చేతులతో తీసివేసే కార్మికులకు రక్షణ కోసం గ్లౌజులు కూడా ఇవ్వాలని కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా తిరుగుతున్న జాతా ఈ నెల 8వ తేదీ గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రకాష్‌నగర్ సెంటర్‌కు చేరుకుంటుందని చెప్పారు. జాతాను జయప్రదం చేయడానికి మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో వి.సతీష్, రాంబాబు, ఎ.శివ, వై.నాని, ఎం.కామాక్షి, సామ్రాజ్యం, లక్ష్మి, సుబ్బులు, మేరి, దుర్గారావు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి నిర్మాణంపై సమీక్ష

ప్రజాశక్తి - నరసరావుపేట

జాతీయ రహదారి 167-ఎ నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులను ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. ఈ మేరకు అధికారులతో కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షించారు. నకిరేకల్లు-నరసరావుపేట-చిలకలూరిపేట మీదుగా ఓడరేవు వరకూ నిర్మించనున్న జాతీయ రహదారి పనుల నిర్వహణ, భూసేకరణ తదితర అంశాల్లో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. సమీక్షలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, డిఎఫ్ఒ రామచంద్రరావు, డిఆర్ఒ వినాయకం, ఆర్‌డిఒలు శేషిరెడ్డి, రాజకుమారి, జాతీయ రహదారుల అథారిటీ ప్రతినిధులు, తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ ఎల్.శివశంకర్


ఫర్నీచర్‌ను అందిస్తున్న రామకృష్ణ తదితరులు

## ప్రభుత్వాస్పత్రికి వితరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి

స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని టీబీ యూనిట్‌కు ఫర్నిచర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కె.రామకృష్ణ మంగళవారం బహుకరించారు. దీంతోపాటు ఇన్ఫెక్షన్లు రాకుండా ఆపరేషన్ థియేటర్‌లో ఉపయోగించే సోడియం హైపో క్లోరైడ్‌ను మెడికల్ హోల్‌సేల్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లి రూ.15 వేలతో సమకూర్చారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆస్పత్రికి అవసరమైన వసతులను సమకూర్చడంలో రామకృష్ణ ముందుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్, టీబి యూనిట్ సూపర్‌వైజర్ స్టాలిన్, హెడ్‌నర్స్ రవణమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ పాల్గొన్నారు.



## పెళ్లికి ప్రత్తిపాటి ఫౌండేషన్ చేయూత

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పేద యువకుడి వివాహ ఖర్చులకు ప్రత్తిపాటి ఫౌండేషన్ చేయూతనిచ్చింది. పట్టణంలోని 6వ వార్డుకు చెందిన నాగండ్ల రాజేశ్వరి కుటుంబానికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రాజేశ్వరి కుమారుడు భరత్ కుమార్ వివాహ ఖర్చులకు గాను రూ.20 వేలను వార్డు టిడిపి అధ్యక్షులు అరె మల్లికార్జునరావు, కార్యదర్శి నాంపల్లి రమేష్ మంగళవారం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఆస్వాదాటి నాగేశ్వరరావు, షేక్ అల్లాభక్షు, షేక్ ఇమామ్, జి.వెంకటేశ్వర్లు, అరె వెంకటేశ్వర్లు, బాజీ, గుంటూరు శ్రీను, ఇట్టే ప్రసాద్, మేకపాటి అశోక్, షేక్ సుభాని పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక పల్నాడు జిల్లా అధ్యక్షులు దార్ల బుజ్జిబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్నారు. పర్యావరణం కాపాడుకోకపోతే రానున్న రోజుల్లో భూగోళంపై మానవ మనుగడ ప్రశ్నర్థకం అవుతుందని హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులతో గురులింగం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జెవివి ప్రచురించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌ఛార్జి నాగుల్ మీరావలి, గోవిందు సరోజిని పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

# విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - మాచర్ల

విత్తన వ్యాపారులు పత్తి, మిర్చి విత్తనాలను రైతులకు సరసమైన ధరలకు అందించాలని మాచర్ల వ్యవశాఖ ఎడిఎ జగదీశ్వరరెడ్డి సూచించారు. మంగళవారం పలు షాపులలో ఏఓ లక్ష్మారెడ్డితో కలిసి తనిఖీలు చేసిన ఆయన మాట్లాడుతూ విత్తన వ్యాపారులు నిబంధనల ప్రకారం విత్తనాలకు సంబంధించిన అనుమతి పత్రాలను దగ్గర పెట్టుకోవాలన్నారు. విత్తన ధరలను తెలుపుతూ పట్టికను ఏర్పాటు చేయాలని చెప్పారు. రైతులకు వారు కోనుగోలు చేసిన విత్తనాలకు బిల్లులను తీసుకోవాలని, పంటకాలం పూర్తయ్యే వరకు సదరు బిల్లులను దాచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఎడిఎ జగదీశ్వరరెడ్డి, ఏవో

# కౌల్దార్లంతా గుర్తింపు కార్డులు పొందండి

ప్రజాశక్తి - బెల్లంకొండ

దరఖాస్తుల సేకరణ, సిసిఆర్‌సి పత్రాల మంజూరు కార్యక్రమం మంగళవారం రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా వన్నాయపాలెం, న్యూ చిట్యాల గ్రామాల్లో నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు జిలాని, కిస్మతున్నిసా మాట్లాడుతూ కౌల్దార్లంతా సిసిఆర్‌సిల కోసం దరఖాస్తు చేసుకోవాలని, భూ యజమాని, సాగుదారుల ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్లు, 1బి, సాగుదారు ఫొటోతో గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించాలని చెప్పారు. గుర్తింపు కార్డు పొందిన వారికి పంటల భీమా, రైతు భరోసా, సున్నా వడ్డీ, కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు పంట అమ్మకానికి వీలుంటుందని చెప్పారు. సిసిఆర్‌సి కార్డుల వల్ల భూ యజమాని హక్కులకు భంగం ఉండదని, యజమానులు సహకరించాలని మండల వ్యవసాయ అధికారి డి.క్రిష్ణయ్య కోరారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది మణికంఠ, ఆశాబి, రైతులు ఎం.వెంకటస్వామి, ఎం.వెంకటేశ్వర్లు, కోటినాగయ్య, ఎం.పెద్ద హుస్సేన్, రామాంజనేయులు నాయక్ పాల్గొన్నారు.


రైతులు, కౌలురైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## విజేతలకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి - నకరికల్లు

యలమంచిలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నకరికల్లులో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులను సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే వైవి ఆంజనేయులు మంగళవారం ప్రదానం చేశారు. పోటీలలో మొదటి బహుమతిని నకరికల్లుకు చెందిన స్కాం సిసి జట్టు గెలుపొందింది. వీరికి రూ.15 వేల నగదు, జ్ఞాపికను అందించారు. రెండో బహుమతి చాగల్లుకు చెందిన 11 స్టార్‌కు రూ.10 వేలు, షీల్డ్‌ను అందించారు. మూడో బహుమతిని కండ్లకుంట జట్టు గెలుచుకుంది. కార్యక్రమంలో యలమంచిలి రామలక్ష్మయ్య, దాసరి కోటేశ్వరరావు, సాగి కోటేశ్వరావు, తిరుమలశెట్టి రంగయ్య, జానకి రామయ్య, పానాది రాంబాబు, ఫణి, సూరి, కిరణ్ కుమార్, అశోక్ కుమార్ పాల్గొన్నారు.





## శ్రీనారా ట్రస్టుతో పార్టీకి సంబంధం లేదు : టిడిపి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నియోజకవర్గంలో పార్టీ ఇన్‌ఛార్జి ప్రత్తిపాటి పుల్లారావును సంప్రదించకుండా ట్రస్ట్ పేరుతో కొంతమంది చిలకలూరిపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మండలాల్లో తిరుగుతూ పార్టీ నాయకులను, దిగువ శ్రేణి కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షులు జువ్వాది మధన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు పండరిపురంలోని పుల్లారావు నివాసంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. శ్రీనారా ఛారిటబుల్ ట్రస్ట్ ముసుగులో కొందరు రాజకీయాలు చేస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలను గందరగోళానికి గురిచేస్తున్నారని, పార్టీకి నష్టం కలిగేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఆ ట్రస్టుకు, టిడిపికి సంబంధం లేదని, నాయకులు గాని, కార్యకర్తలుగానీ ఆ ట్రస్టు కార్యక్రమాల్లో పాల్గొనద్దని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ కార్యదర్శి పఠాన్ సమద్‌ఖాన్, నాదెండ్ల, యడ్లపాడు మండలాల అధ్యక్షులు బి.సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



## ప్రతి ఇంట్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్ ఉండాలి

ప్రజాశక్తి - రాజుపాలెం

అతిసార నియంత్రణ పక్షోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రమైన రాజుపాలెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవితేజ నాయక్ మాట్లాడుతూ 0-5 ఏళ్లలోపు పిల్లలకు విరోచనాలు అయితే నియంత్రించుకునే విధానాలను వివరించారు. కాచి చల్లార్చిన నీటిని తాగించాలని, వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఇంట్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జీవన్‌రావు, హెల్త్ విజిటర్స్ ఉదయలక్ష్మీ, ఉషారాణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ దేవనాయక్, ప్రియదర్శిని, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సమ్మేళనంపై ప్రచారం

ప్రజాశక్తి - నరసరావుపేట

పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఈనెల 13, 14, 15 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి రైతు సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రమైన రొంపిచర్ల, మండలంలోని మాచవరం, సంతగుడిపాడు గ్రామాల్లో మంగళవారం ప్రచారం చేశారు. నరసరావుపేటలోని పల్నాడు రోడ్డు ఎస్ఎస్ఎన్ కళాశాల ఆడిటోరియంలో సమ్మేళనం ఉంటుందని, సంఘం రాష్ట్ర నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారని తెలిపారు. ప్రచారంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, అంజిరెడ్డి, అచ్యుత్‌రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

## ట్రాక్టర్ ప్రమాద బాధితుల్ని పరామర్శించిన ఎంపి అయోధ్య రామిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

వట్టిచెరుకూరు వద్ద ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంగళవారం రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఎవరు భయపడాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆసుపత్రి లో గాయపడిన వారికి వైద్య సేవలు అందుతున్నాయని, ఎవరికి ఇబ్బందులు లేకుండా సత్వరమే వైద్య సేవలు అందించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. అలాగే ఆసుపత్రి అభివద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కార్పొరేట్ స్థాయికి తీసుకుని వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అందుకోసం త్వరలోనే ఆసుపత్రి వర్గాలతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తానని ఆయన అన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఆసుపత్రి అభివద్ధి కోసం ఎంపీ అయోధ్య రామిరెడ్డి కషిని అభినందించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, సివిల్ సర్జన్ ఆర్.యం.ఓ డాక్టర్ సతీష్ కుమార్, రాష్ట్ర గ్రంధాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.



క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై జిజిహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న ఎంపి అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా



## మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

వట్టిచెరుకూరు మండలంలో సోమ వారం ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు ఒక్కొకరికి రూ. 25 లక్షల పరిహారం ఇవ్వలని గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మైనర్ బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళ వారం బాధిత కుటుంబాలను తెలుగు దేశం పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతతరం ప్రత్తిపాడు మండల కేంద్రం లోని పార్టీ కార్యలయం ఆయన మాట్లాడుతూ గతంలో గుంటూరులో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు వాసులకు గత టిడిపి ప్రభుత్వం రూ.25 లక్షలు ప్రకటించి ఆ కుటుంబాలను అడుకున్నమని అలాగే ఇప్పుడు కూడా ప్రత్తిపాడు మండలం కొండపాడు గ్రామానికి చెందిన మృతుల కుటుంబాలకు ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల ప్రకటించిందని, ఇది సరికాదని వారికీ రూ.25లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల అద్యక్షులు గింజు పల్లి శివ రం ప్రసాద్, బుల్లా సూదాకర్, నీయోజక వర్గ ప్రదాన కార్యదర్శి, ఎస్ సి సెల్ బాగ్యరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి బసవ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం విశాఖపట్టణం కో-ఆపరేటీవ్ బ్యాంక్ సేవలు

ప్రజాశక్తి - మంగళగిరి



పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా ది విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సేవల చేస్తుందని బ్యాంక్ చైర్మన్ సిహెచ్ రాఘవేంద్రరావు అన్నారు. మంగళవారం మంగళగిరి బ్రాంచ్ సభ్యుల మహాసభ స్థానిక వైష్ణవి కళ్యాణ మండపంలో జరిగింది. మహాసభకు బ్రాంచ్ ఇంచార్జ్ డైరెక్టర్ పి వెంకటరమణారావు అధ్యక్షత వహించారు. రాఘవేంద్రరావు తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకులో తక్కువ వడ్డీకి బంగారం రుణం ఇవ్వడం జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశంలో ఏ సహకార బ్యాంకు లోన్ అమలు చేయని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు. సభ్యులకు వివిధ రకాల ద్వారా రుణ సదుపాయం కల్పించడం జరిగింది అన్నారు. విజయవాడ జోనల్ మేనేజర్ సిహెచ్ వి ఆర్ సుబ్రహ్మణ్యం, ప్రాంచి ఇంచార్జ్ డైరెక్టర్ సిహెచ్ కోటేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ కె వి బి పని ప్రసాద్ పాల్గొన్నారు.

## అప్రకటిత విద్యుత్ కోతలతో విలవిల

ప్రజాశక్తి - పెదకాకాని

మండలంలోని నంబూరు గ్రామంలో అప్రకటిత విద్యుత్ కోతలకు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారంలో ప్రకటిత కోతలు 3రోజులు ఉంటే, అప్రకటిత కోతలు 3రోజులు అన్న చందాన విద్యుత్ శాక తీరు ఉందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. రాత్రుళ్లు 5గంటల కరెంటు కోతతో గ్రామం మొత్తం అంధకారంలో ఉంటుందన్నారు. పెరిగిన ఉష్ణోగ్రతలతో ఒకవైపు ఇంటి నుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొంటే విద్యుత్ కోతలతో రాత్రి వేళలో సైతం మహిళలు,వృద్ధులు ఇంటి నుండి బయటకు వచ్చి కరెంటు ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నామన్నారు. బిల్లు కట్టడం ఒక నెల ఆలస్యమైతే ఫీజులు తీస్తున్నారని, మరి ఈ విధంగా కరెంటు కోతలు విధిస్తే బిల్లు ఎలా కడతాము అని గ్రామస్తులు వాపోతున్నారు.



## బినామీ కాంట్రాక్టర్లతో అభివృద్ధి పనులు తగదు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులతో బినామీ కాంట్రాక్టర్లతో అభివృద్ధి పనులు చేయించడం తగదని ఆంధ్రప్రదేశ్ బీసీ సేన అధ్యక్షులు ఎస్ నాగరాజు విమర్శించారు. మంగళవారం బీసీ సేన ఆధ్వర్యంలో కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌కు 2019 నుండి ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి పనుల వివరాలు గురించి తెలియజేయాలని ఆర్టీఐ కింద వినతి పత్రం అందజేశారు. కోట్లాది రూపాయలు నిధులు మంజూరయ్యాయని అయితే ఏకపక్ష నిర్ణయాలతో గుత్తేదారుల బినామీ పేర్లతో కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెప్పిన విధంగా కాంట్రాక్టర్లలో 50శాతం బిసి, ఎస్సి, ఎస్టీ మైనార్టీ కాంటాక్టకు అవకాశం కల్పించలేదని విమర్శించారు. అభివృద్ధి పనుల్లో కూడా నాణ్యత లేదని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సేన నియోజవర్గ అధ్యక్షులు సాదు వేణుగోపాల్, బీసీ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఆసిఫ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాష్ట్ర కోఆర్డినేటర్ పి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పాడిరైతు కుటుంబానికి సంగం డెయిరీ చేయూత

ప్రజాశక్తి- మేడికొండూరు



మేడికొండూరు మండలం భీమినేనివారిపాలెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో పాడి మహిళా రైతు ముప్పాళ్ళ శివకుమారి మృతి చెందారు. విషయం తెలుసుకున్న సంఘం డైరీ శాఖ రెంటపాళ్ల బిఎంసి మేనేజర్ గోపి, సూపర్వైజర్ ఎం నవీన్ డివిసి అభయ స్కీం కింద రూ. 60 వేల నగదును మృతి చెందిన శివకుమారి కుమారుడైన రాజేంద్రప్రసాద్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ గోపి మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే సంగం డైరీ ధ్యేయంగా పనిచేస్తుందని రైతులకు తెలియజేశారు. గ్రామ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షులు గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 10శాతం వెన్న వచ్చిన పాలకు లీటరుకు రూ.80, 12శాతం వెన్న వచ్చిన పాలకు రూ.96 చొప్పున సంఘం డైరీ చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ దండ కోటేశ్వరరావు, టెస్టర్ కేతినేని శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోమలు వ్యాప్తి నివారణకు స్వచ్ఛందంగా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల



దోమల వ్యాప్తి నివారణకు స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరు చర్యలు చేపట్టాలని ఈమని పిహెచిసి వైద్యాధికారి డాక్టర్ ఇన్నారావు తెలిపారు. ఈమని గ్రామంలో మంగళవారం మలేరియా మాసోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నారావు మాట్లాడుతూ నీటి నిలువలు నివారించి దోమల వ్యాప్తిని అరికట్టాలన్నారు. దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులని వాటి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రాబోయే వర్షాకాలంలో ప్రతి ఒక్కరు దోమతెరలు వాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణవేణి, పీహెచ్సీ సిబ్బంది విజయభాస్కర్, వందనాదేవి, వీరయ్య, శ్రీనివాసరావు, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాల్లో కెఎల్ వర్శిటీకి 28వ ర్యాంకు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

దేశంలోని అత్యుత్తమ ప్రమాణాలు పాటించే విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో అద్భుత విజయం సాధించడం పట్ల కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ పార్థ సారధి వర్మ సంతృప్తి వ్యక్తం చేశారు. నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ ర్యాంకింగ్స్ 2023లో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకుగాను ఈ ర్యాంకును కేంద్రం ప్రకటించింని ఆయన తెలిపారు. కెఎల్ విశ్వవిద్యాలయం దేశంలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలలో 28వ ర్యాంక్‌ను సాధించిందన్నారు. భారతదేశంలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో 44వ ర్యాంక్‌ను, దేశంలోని అన్ని మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రశంసనీయమైన 52వ ర్యాంక్ ను సాధించడంతో పాటు ఓవరాల్ ర్యాంకింగ్ లో టాప్ 100లో 50వ ర్యాంక్ సాధించి కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీ గణనీయమైన గుర్తింపును సాధించిందన్నారు. ఈ గుర్తింపు విద్యాపరమైన నైపుణ్యం, పరిశోధన మరియు ఆవిష్కరణల పట్ల తమ అచంచలమైన నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తమ వర్శిటీలో విద్యార్థులు నాయకులుగా మారేందుకు అవసరమైన పరిజ్ఞానం, నైపుణ్యాలు, విలువలతో కూడిన సాధికారత సాధించేందుకు తాము, తమ అధ్యాపకులు నిరంతరం కృషి చేస్తున్నామని డాక్టర్ సారధి వర్మ తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు పాల్గొన్నారు.



డాక్టర్ బాబు ఆర్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్

## నడకతో గుండెకు ఆరోగ్యం

ప్రజాశక్తి-తెనాలి:

శారీరక వ్యాయామానికి నడక దోహద పడుతుందని డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి అన్నారు. స్థానిక కవిరాజా పార్క్‌లోని వడ్లమూడి గోపాల కృష్ణయ్య స్మారక సీనియర్ సిటిజన్స్ భవన్‌లో మంగళవారం జరిగిన వాకర్స్ క్లబ్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రవాస భారతీయుడైన బాబు ఆర్ 'మన ఆరోగ్యం కాపాడుకోవటం ఎలా' అన్న అంశంపై మాట్లాడారు. క్యారెట్, క్యాబేజి, కీరా వంటి పచ్చి కూరగాయలు తింటూ, ఆహార నియమాలు పాటిస్తూ, ప్రతిరోజు నడకతో గుండె, ఊపిరితిత్తుల సమస్యలకు దూరంగా ఉండవచ్చునన్నారు. ఈ సందర్భంగా ఆయనను క్లబ్ బృందం సత్కరించింది. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె.రవిబాబు, పి.అనందయ్య, టి.రత్తయ్య, సిహెచ్ అశోక్‌కుమార్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

## 11న కాపుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - మంగళగిరి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి చేగొండి. హరిరామజోగయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కాపు సంక్షేమ సేన ఆధ్వర్యంలో ఈ నెల 11 న మంగళగిరి జనసేన నియోజకవర్గ కార్యాలయంలో కాపుల ఆత్మీయ సమావేశం జరుగుతుందని కాపు సంక్షేమ సేన మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు తిరుమలశెట్టి కొండలరావు మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో తెలిపారు. కాపులకు రాజ్యాధికారం, రిజర్వేషన్ సాధన కొరకు ఏర్పాటు చేసిందే ఈ కాపు సంక్షేమ సేన అని, జనాభాలో 28% ఉన్నప్పటికి ఈ రోజుకి రాజ్యాధికారం పొందలేకపోయామని ఇప్పుడైనా ఆ దిశగా కాపులు ఆలోచించాలని దాసరి.శివ నాగేంద్రం అన్నారు. ఈ కార్యక్రమం లో కాపు నేతలు దాసరి. వెంకటేశ్వర రావు, బాణాల.నాగేశ్వరరావు, బళ్ళ. ఉమా మహేశ్వర రావు, కాపరౌతు సుందరయ్య పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్య శాఖలో బదిలీలకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలోని మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని క్యాడర్ ఉద్యోగులకు జరిగే సాధారణ బదిలీలకు వివిధ కేటగిరీలలో బదిలీలకు 5 సంవత్సరాల నిండిన అభ్యర్థుల జాబితా, ప్రస్తుతం ఉన్న ఖాళీలను, అప్లికేషన్ ప్రొఫార్మా ప్రభుత్వ జిల్లా వెబ్‌సైట్ స్త్రబత్‌బతీ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రావణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి నమూనా అప్లికేషన్‌ను తీసుకొని, వారి ఆప్షన్లు పొందుపరిచి, వారి డిడిఒ ద్వారా ఈనెల 10వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు స్వయంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. గడువు తర్వాత అప్లికేషన్లు ఎట్టి పరిస్థితుల్లో స్వీకరించబోమన్నారు. ప్రస్తుత స్థానంలో 2023 ఏప్రిల్ 30 నాటికి రెండేళ్ల సర్వీసు నిండిన ప్రతి ఉద్యోగి రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్‌కు అర్హులని అన్నారు.



కరపత్రాలు పంచుతూ, సంతకాలు సేకరిస్తున్న నాయకులు

## రేపు గుంటూరుకు మున్సిపల్ జాతా

ప్రజాశక్తి-గుంటూరు

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల్ని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, 010 పద్దు క్రింద జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్లపై నిర్వహిస్తున్న రాష్ట్ర జాతా ఈనెల 8న ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుకుంటుందని, ఈ సందర్భంగా జిఎంసి ప్రధాన కార్యాలయం వద్ద జరిగే సభలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు గుంటూరు నగర తూర్పు ప్రధాన కార్యదర్శి కట్లకుంట శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జాతా జయప్రదం కోరుతూ మంగళవారం నగరంలోని వివిధ పారిశుధ్య కార్మికుల మస్టర్ ఆఫీసుల వద్ద కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేసి, వినతిపత్రంపై సంతకాలు సేకరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు కాంట్రాక్ట్, ఔట్ ఉద్యోగులు, కార్మికుల్ని రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని అన్నారు. కార్మికులు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకూ పోరాడతామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, నగర నాయకులు షేక్ ఖాసిం వలి, గండికోట శంకర్రావు, షేక్ ఖాసిం షహీద్, తెల్లమేకల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ నర్సులకు తీవ్ర అన్యాయం

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగ సంఘాలతో మంత్రి వర్గం భేటీలో జరిగిన నిర్ణయాలు కాంట్రాక్టు నర్సింగ్ ఉద్యోగుల గొంతు కోసేలా ఉందని ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వచ్ఛంద ప్రసాద్ ఒక ప్రకటనలో అన్నారు. 2010 నుండి ఇప్పటి వరకు ఒక్క రెగ్యులర్ పోస్ట్ నర్సింగ్‌లో లేక, ప్రభుత్వం మమ్మల్ని రెగ్యులర్ చేస్తుందని అని ఎన్నో ఆశలతో ఉన్న తమకు తీవ్ర అన్యాయం చేసేలా తీసుకున్న నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. 2014 జూన్ 2 నాటికి 5 సంవత్సరాల సర్వీస్ ఉండాలి అనే నిబంధన వల్ల నర్సింగ్ విభాగంలో ఒక్క కాంట్రాక్టు ఉద్యోగి కూడా రెగ్యులర్ అవ్వడం జరగదు అని, దీని వల్ల ఎన్నో ఆశలతో ఓటు వేసి గెలిపించుకున్న తమను నట్టేట ముంచారని విమర్శించారు. దాదాపు 10 వేల మంది నర్సింగ్ సిబ్బంది రెగ్యులర్ ఆశతో ఉంటే వారి ఆశలను బుగ్గి పాలు చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి చెందుతుందని పేర్కొన్నారు.కరోనా సమయంలో ప్రాణాలు కోల్పోయి కూడా రోగులను కాపాడిన నర్సులను ప్రభుత్వం మోసం చేయటం తగదన్నారు. వెంటనే కాంట్రాక్టులో మగ్గిపోతున్న నర్సింగ్ అధికారులను, సిహెచ్‌ఓలను రెగ్యులర్ చెయ్యాలి అని డిమాండ్ చేశారు. లేదంటే జరిగే ఆందోళనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## కొండేపాడు బాధితులకు భీమ్ భారత్ పరామర్శ

ప్రజాశక్తి-గుంటూరు



బాధితుల్ని పరామర్శిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు మండలం, కొండేపాడుకు చెందిన మహిళలు శుభకార్యానికి వెళుతూ వట్టిచెరుకూరు వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి, ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలను భీమ్ భారత్ నాయకులు మంగళవారం పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ సందర్భంగా భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ మాట్లాడుతూ చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. చిన్న చిన్న గాయాలు అయిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కొన్ని సంఘటనలు చూసినప్పుడు నెల్లూరు జిల్లాకు సంబంధించిన వ్యవసాయ కూలీలు ట్రాక్టర్ బోల్తా పడి చనిపోతే ప్రభుత్వం రూ.25 లక్షలు ప్రకటించిందని, అదేవిధంగా విశాఖపట్నంలో గ్యాస్ లీకేజీ వర్కర్లు చనిపోతే ఇదే ప్రభుత్వం రూ.1 కోటి ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రస్తుత ఘటనలో బాధితులు దళితులు కాబట్టి రూ.5 లక్షలు ప్రకటించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. బాధితుల్ని పరామర్శించిన వారిలో రజక సంఘం రాష్ట్ర నాయకులు జూపూడి శ్రీనివాస్, జల్ది మోహన్ తదితరులున్నారు.

వరికపూడిశెల ఎత్తిపోతల పథకాన్ని సాధించేందుకు ...


# నేడు మాచర్లలో రౌండ్‌టేబుల్ సమావేశం

### హాజరు కానున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

### జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకుల పిలుపు

ప్రజాశక్తి - మాచర్ల

పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, వెల్దుర్తి మండలంలో కృష్ణానదిపై దశాబ్దల క్రితం పల్నాడు ప్రాంత రైతుల అవసరాల దృష్టా నిర్మించ తలపెట్టిన వరికపూడిశెల ఎత్తిపోతల పథకం రాజకీయ నాయకుల వాగ్దానాలు, అధికారుల హడవిడితో సరిపోతుందని రైతుల సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వరికపుడిశెల సాధన ధ్యేయంగా బుధవారం మాచర్లలో నిర్వహిస్తున్న రౌండ్‌టేబుల్ సమావేశానికి ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు హాజరవుతారని సిపిఎం నాయకులు బండ్ల మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మహేష్ మాట్లాడుతూ తీవ్ర కరువు పీడిత ప్రాంతాలైన పల్నాడు, ప్రకాశం జిల్లాలోని 5 మండలాలకు తాగు, సాగు నీరు అందించేందుకు 6 దశాబ్దల క్రితమే వరికపూడిశెల ఎత్తిపోతలను నిర్మిస్తేనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని నిర్ణయించినట్లు వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణ సమయంలోనే కోస్లా కమిటీ నివేదిక ఇచ్చినట్లు గుర్తు చేశారు. అప్పటి నుండి పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యంపై, ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం అనేక ఉద్యమాలు జరిగినట్లు వివరించారు. నేటికి సదరు కల నేరవేరనట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి అయితే వెల్దుర్తి, దుర్గి, బోల్లాపల్లి, ప్రకాశం జిల్లాలోని పుల్లలచెరువు మండలాలకు చెందిన షుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని, అనేక గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఈ మండలాలకు సమీపంలోనే కృష్ణా నది పరవళ్ళు తొక్కుతున్నా వెల్దుర్తి మండలం తల వాకిటనే ప్రపంచ ప్రసిద్ధి గాంచిన నాగార్జునసాగరు జలాశయం ఉన్నా, దశాబ్దల తరబడి ఈ మండలాలు కరువు బారిన పడి రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల వాగ్దానంగానే ఈ ప్రాజెక్ట్ రాజకీయ నాయకుల అవసరాలను తీర్చుతుందన్నారు. 1995లో అప్పటి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయడు, తరువాత 2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఈ పథకం పూర్తి చేసేందుకు శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ వరికపుడిశెల పూర్తి చేస్తేనే తిరిగి ఎన్నికలలో పోటి చేస్తానని ప్రభుత్వ విప్ శపథం కూడ చేసినట్లు బండ్ల మహేష్ తెలిపారు. ప్రాజెక్ట్ కోసం అటవీశాఖ అనుమతులు వచ్చినట్లు అధికార పార్టీ నాయకులు తెలియజేస్తున్నారన్నారు. 19.3 హెక్టార్ల అటవీ భూమి సేకరించి, దానికి బదులుగా దుర్గి మండలంలోని అడిగోప్పల సమీపంలో 21.44 హెక్టార్లు భూమిని ప్రభుత్వం కేటయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారంలోకి వచ్చిందన్నారు. అయితే ఈ పనులు కార్యరూపం దాల్చకపోవటం, ప్రాజెక్టు ప్రారంభం కాకపోవటంపట్ల ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. వరికపూడిశెలను వెంటనే ప్రారంభించాలని పలు ప్రజా సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో మాచర్ల పట్టణంలోని శ్రీ కోదండ రామాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతున్నట్లు వివరించారు. రౌండ్ టేబుల్ సమావేశానికి అధిక సంఖ్యలో రైతు నాయకులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ఫుల్‌టైమ్ గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలు పెంచాలి

### ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు వినతి

ప్రజాశక్తి-గుంటూరు : పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థలో పనిచేస్తున్న ఫుల్‌టైమ్ గెస్ట్ ఫ్యాకల్టీ వేతనాలు పెంచాలని పాఠశాల విద్య కమిషనర్ సురేష్‌కుమార్‌ను ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు కోరారు. ఈ మేరకు కమిషనర్‌కు ఎపిఆర్ఇఐటిఎ నాయకులు డి.మధుసూదనరావు, డాక్టర్ పి.వి.మల్లేశ్వర్, ఫుల్‌టైమ్ గెస్ట్ ఫ్యాకల్టీ ప్రతినిధి కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. వేతనాల పెంపునకు తన వంతు కృషి చేస్తానని సురేష్‌కుమార్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.



సురేష్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ కెఎస్, తదితరులు

## క్రమశిక్షణ, క్రమబద్ధమైన జీవనానికి క్రీడలు

ప్రజాశక్తి-గుంటూరు : విద్య తర్వాత మానవుల జీవన గమనాన్ని నిర్ధేశించగల శక్తి ఒక్క క్రీడలకు మాత్రమే ఉందని ఎమ్మెల్సీ, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. క్రమశిక్షణ, క్రమబద్ధమైన జీవనానికి క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని, రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కట్టుబడి ఉందని అన్నారు. ఈనెల 3, 4 తేదీలలో బిఆర్ స్టేడియం వేదికగా జరిగిన ఓపెన్ స్టేట్ లెవల్ ఛాంపియన్ షిప్ స్కేటింగ్ పోటీలలో ఇన్నర్ రింగ్ రోడ్డులోని ఆర్కే స్కేటింగ్ రింక్ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి పలు పతకాలను కైవసం చేసుకున్నారు. మంగళవారం బృందావన్ గార్డెన్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆటలో గెలవడానికి ఎలాగైతే ఆఖరి నిమిషం వరకూ పోటీ పడతారో, జీవితంలో కూడా లక్ష్యాన్ని సాధించే విషయంలో అంతే పట్టుదలగా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో



క్రీడాకారుల్ని అభినందిస్తున్న అప్పిరెడ్డి, తదితరులు

కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), మోతుకూరి వెంకటరత్నం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య, స్కేటింగ్ కోచ్ షేక్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## 14న విజ్ఞాన్స్ వర్సిటీలో అంతర్జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు :వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఈనెల 14న అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. మంగళవారం వర్సిటీలో వర్క్‌షాప్ గోడపత్రికలను వీసీ విడుదల చేశారు. యూనివర్సిటీలోని స్కూల్ ఆఫ్ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలోని ఈసీఈ డిపార్ట్ మెంట్ ఆధ్వర్యంలో 'వైర్‌లెస్ కమ్యూ నికేషన్స్ అండ్ యాంటినా టెక్నాలజీస్ ఫర్ స్పేస్, ఏయిర్ అండ్ గ్రౌండ్ అప్లికేషన్స్' అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూఎస్‌ఏలోని రావూస్ కన్సల్టెంట్స్ ప్రెసిడెంట్, సీఈవో, ఐఈఈఈ లైఫ్‌ఫెల్లో డాక్టర్ సుధాకర్‌రావ్, యూఎస్‌ఏలోని నాసా/ జేపీఎల్ సీనియర్ ఇంజినీర్ డాక్టర్ నాసెర్ చహత్, బెంగళూరులోని క్వాడ్‌జెన్ వైర్‌లెస్ ప్రెసిడెంట్, సీఈవో సీఎస్.రావ్, తైవాన్‌లోని ఫెంగ్ చియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చో-యెన్-డెస్‌మోండ్, ఇస్తాంబుల్ అట్లాస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ఎల్.సెవి, యూఎస్‌ఏలోని నాసా/జేపీఎల్ యాంటీనా ఇంజినీర్ డాక్టర్ గౌరాంగి గుప్త, పులివెందుల జేఎన్‌టీయూఏలోని ఈసీఈ హెడ్ ప్రొఫెసర్ రమణా రెడ్డి హాజరవుతున్నారని తెలియజేసారు.కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.